ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శుక్రవారం 5 సెప్టెంబరు 2025



'ఉన్నతి' రుణాల రికవరీ పెంచాలి: డీఆర్‌డీఏ పీడీ

సీతంపేట రూరల్, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): ఉన్నతి, స్త్రీనిధి రుణాల రికవరీ శాతం పెంచాలని డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి ఆదేశించారు. ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న వీడీవీకేలను గురువారం పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న మహిళలతో ముచ్చటించారు. కొండచీపుర్లను మోడల్‌గా తయారుచేస్తే కొంత గిట్టుబాటు ధర వస్తుందని సూచించారు. దిబ్బగూడలో అడ్డాకులతో తయారుచేస్తున్న పేపర్‌ప్లేట్ యంత్రాన్ని పరిశీలించారు. అనంతరం వెలుగు సీసీలతో సమీక్షించారు. ఆమె వెంట డీపీఎం అనిల్, ఏపీఎంలు , సీసీలు పాల్గొన్నారు.

విభిన్న ప్రయత్నం..

బోధన వినూత్నం

- విద్యార్థులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర
- హాజరు పెంపుపై ప్రత్యేక శ్రద్ధ
- పాఠశాలల అభ్యున్నతికి కృషి
- రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనం





విద్యా బోధనలో వినూత్నంగా రాణించారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో తమదైన ముద్ర వేశారు. తెలుగు భాషపై పిల్లలు పట్టు సాధించేలా తమవంతు కృషి చేశారు. పాఠశాలల అభివృద్ధికి చర్యలు చేపడుతూనే మరోవైపు సాహిత్య, కళా రంగాల్లో విభిన్నంగా రాణించి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని విజయవాడలో వారు అవార్డు అందుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తమ గురువులపై ప్రత్యేక కథనం.

సంస్కృతం, తెలుగుపై ఆసక్తి పెంచేలా..



పాలకొండ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సంస్కృత ఉపాధ్యాయుడు బౌరోతు శంకరరావు బోధనా శైలే వేరు. సంస్కృతం, తెలుగు భాష ఔన్నత్యంపై ప్రచారం చేస్తూ.. విద్యార్థులు వాటిపై పట్టు సాధించేలా కృషి చేస్తున్నారు. 23 ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా కొనసాగుతున్న ఆయన విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికితీసి.. వారికి అవసరమైన తర్ఫీదు ఇస్తున్నారు. రంగ స్థల నటుడిగా రాణిస్తూ మరోవైపు సూర్యచంద్ర కళాసమితి సంస్థ ద్వారా తెలుగు, సంస్కృతంపై అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటివరకు సుమారు 600కు పైగా సన్మాన పత్రాలను రచించారు. జిల్లెళ్లమూడి అమ్మవారి జీవితచరిత్ర, శంకర శతకం తదితర పుస్తకాలను కూడా రచించారు. ఇదిలా ఉండగా.. పిల్లలతో నాటకాలు వేయించడం, సంభాషణా నైపుణ్యాలను పెంపొం దిస్తున్నారు. సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక శిక్షణ ఇచ్చి తెలుగు, సంస్కృతంపై మక్కువ కలిగేలా చొరవ చూపుతున్నారు. తల్లిదండ్రులతో మాట్లాడి.. విద్యా ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగేలా కృషి చేస్తున్నారు. శంకరరావు మాస్టారు జిల్లెళ్లమూడి అమ్మ సేవా సంస్థ ద్వారా పేదలకు అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రతి నెలా ఏదో ఒక ప్రాంతంలో సేవలు అందిస్తూ ముందుకు సాగుతున్నారు. ఏ సందర్భంలోనైనా ఎక్కడైనా, ఏ వేదికపై అయినా తెలుగులోనే ఆయన సంభాషిస్తారు. తెలుగు లోనే సంతకం కూడా చేస్తారు. 'రాష్ట్రస్థాయి అవార్డు మరింత బాధ్యత పెంచింది. సంస్కృతం, తెలుగు భాషలపై విద్యార్థులు మక్కువ పెంచేలా ప్రయత్నిస్తా. విద్యార్థి దశ నుంచి తెలుగులో మాట్లాడించేందుకు, విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు నిరంతరం శ్రమిస్తా.' అని శంకరరావు మాస్టారు తెలిపారు.

నిరంతర పర్యవేక్షణ



విద్యార్థులతో అక్షరాలు రాయిస్తున్న యర్రా శంకరరావు (ఫైల్)

జియ్యమ్మవలస: 'రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు రావడం చాలా ఆనం దంగా ఉంది. ఇది నా బాధ్యతను మరింత పెంచింది.' అని అవార్డు గ్రహీత యర్రా శంకరరావు తెలిపారు. పెదబుడ్డిడి ఎంపీపీ స్కూల్ (బీసీ)లో ఎస్‌జీటీగా పనిచేస్తున్న ఆయన వినూత్న బోధనా పద్ధతులు పాటిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ప్రధానంగా పాఠశాల భౌగోళిక అభివృద్ధిలో భాగంగా తరచూ గ్రామ పెద్దలు, తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి పాఠశాల అభివృద్ధిపై చర్చిస్తుంటారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని నిత్యం పర్యవేక్షిస్తారు. పిల్లలు నిరంతరం పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. దాని ద్వారా రోజూ పర్యవేక్షిస్తారు. ప్లేబెస్ట్ యాక్టివిటీ ద్వారా ఆట పాటలతో నాట కీకరణ విద్య అందిస్తున్నారు. ప్రాథమిక విద్యార్థుల్లో పిజికల్, కాగ్నేటివ్, సోషియో ఒమేషనల్ వంటి విద్యా ప్రవే శిక కార్యక్రమాలు రోజూ నిర్వహిస్తుంటారు. కథలు, కబుర్లు, సంభాషణ ద్వారా విద్యా బోధిస్తారు. తర్ల్, కిప్, క్లాప్, క్లాప్స్ లెర్నింగ్, ఎన్‌హేన్స్‌మెంట్ ప్రోగ్రాం, జ్ఞానధార, కొత్త పాఠ్య పుస్తకాలు, తదితర అంశాల గురించి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, అనకాపల్లి జిల్లాల ఉపాధ్యాయులకు స్టేట్ రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు.

చిత్తశుద్ధితో పనిచేస్తూ..



కొమరాడ: విద్యార్థుల ఉన్నతికి చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డి.లక్ష్మణరావు మాస్టారు. కొమరాడ ఏపీటీడబ్ల్యూఆర్ బాలుర పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఆయన విద్యార్థులకు గణితంపై ఉండే భయం పోగొట్టేలా తనవంతు కృషి చేస్తున్నారు. గణితంలో గమ్మత్తులను పరిచయం చేస్తూ అందరికీ అర్థమయ్యేలా బోధిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో అవగాహన కల్పిస్తున్నారు. సైన్స్ మ్యాథ్స్ ఫెయిర్‌లు నిర్వహిస్తూ శాస్త్రీయ దృక్ప థాన్ని పెంపొందిస్తున్నారు. పిల్లల ఆలోచనలతో నవీన ఆవిష్కరణలకు తన వంతు ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు పాఠశాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులను భాగస్వాములను చేసి అందరి మన్ననలు పొందుతున్నారు. కాగా రాష్ట్రస్థాయి అవార్డు రావడం మరింత బాధ్యతను పెంచిందని ఆయన తెలిపారు.

రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా తెర్లి ఎంపిక



గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తెర్లి రవికుమార్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు వరించింది. 1999లో ఇంటర్మీడియట్ విద్యా విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఆయన నియమితులయ్యారు. ఎనిమిదేళ్ల పాటు సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేశారు. 2007లో పదోన్నతిపై సీనియర్ అసిస్టెంట్‌గా చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరారు. 2009లో పదోన్నతి పొంది సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ జూనియర్ లెక్చరర్‌గా విధుల్లో చేరారు. 2015న బదిలీపై పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరారు. ఈ ఏడాదిలో గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా చేరారు. మరో వైపు ఎన్‌ఎస్‌ఎస్ ప్రాజెక్టు ఆఫీసర్‌గా అనేక సేవా కార్యక్రమాలు, స్పెషల్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నారు. 2013లో ఉమ్మడి విజయనగరం జిల్లా ఉత్తమ అధ్యాపక అవార్డును కూడా పొందారు. తాజాగా రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఆయన ఎంపిక కావడంపై జిల్లాలోని పలు కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

చదువుల్లో రాణించాలి

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్

సీతంపేట రూరల్,సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థినులు చదువుల్లో రాణించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవర్‌స్వప్నిల్ జగన్నాథ్ సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. పూతికవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నతపాఠశాలను గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం గూడంగి కాలనీలో మల్టీపర్పస్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని టీడబ్ల్యూ డీఈ నాగ భూషణ్‌ను ఆదేశించారు. పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. మర్రిపాడు పీహెచ్‌సీలో రోజువారీ ఓపీ, సీజనల్ వ్యాధులపై వైద్యాధికారి సత్య వాణిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏపీవో జి చిన్నబాబు,హెచ్‌ఎం ఊర్వశి తదితరులు ఉన్నారు.



పూతికవలస ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులు, సిబ్బందితో కలిసి భోజనం చేస్తున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్

జిల్లా ఉత్తమ గురువులు 90 మంది

- నేడు పార్వతీపురంలో అవార్డుల ప్రదానం

పార్వతీపురం/సాలూరు రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో 90 మందిని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేశారు. వారిలో 14 మంది హెచ్‌ఎంలు, 36 మంది ఎస్‌ఏలు, 40 మంది ఎస్జీటీలు ఉన్నారు. ఉన్నత పాఠశాలల్లో గ్రేడ్ టూ హెచ్‌ఎం, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలను ఒక కేటగిరీగా 14 మందికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రకటించారు. పాఠశాల సహాయకులు, అదే క్యాడర్‌లో పీడీలు ముగ్గురు, పీజీటీతో సహా 36 మందికి స్కూల్ అసిస్టెంట్లుకు అవార్డులు ప్రకటించారు. జిల్లాలో 40 మంది సెంకడరీగ్రేడ్ ఉపాధ్యాయులు కూడా ఈ జాబితాలో ఉన్నారు. వారితో ముగ్గురు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులకు జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్‌లో శుక్రవారం అవార్డులు అందించనున్నట్లు డీఈవో రాజ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ప్రభుత్వ విప్ జగదీశ్వరి, ఎమ్మెల్యేలు విజయచంద్ర, జయకృష్ణ హాజరవుతారని పేర్కొన్నారు.

7న కోటదుర్గమ్మ ఆలయం మూసివేత

పాలకొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం కారణంగా ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం కోట దుర్గమ్మ ఆలయాన్ని ఈ నెల 7న మధ్యాహ్నం 12 గంటలకు మూసివేయనున్నట్లు ఈవో వి.వి.సూర్య నారాయణ, ప్రధాన అర్చకుడు డి. లక్ష్మీ ప్రసాదశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించిన అనంతరం ఉదయం ఏడు గంటల నుంచి 9 గంటల వరకు అమ్మవారి దర్శనానికి అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు దసరా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా ఏటాలనే 8న ఉదయం 9 గంటలకు అమ్మవారికి తెరవేయ నున్నట్లు వారు తెలిపారు. 22న ఉదయం 8 గంటల నుంచి అమ్మవారు నిజరూప దర్శనం ఉంటుదని చెప్పారు.

సాంకేతికతతో నేర నియంత్రణ: ఎస్పీ

బెలగాం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలను నియంత్రించొచ్చని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అధునాతన సాంకేతిక సదుపాయాలతో ఏర్పాటుచేసిన పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్, ఉమెన్ వెల్నెస్ రూమ్‌లను ఆయన ప్రారంభించారు. ప్రజలకు మరింత భద్రత కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సమాజ రక్షణలో సాంకేతిక పరిజ్ఞానం మరింత దోహదపడుతుందని తెలిపారు. మహిళా ఉద్యోగుల కోసమే ఉమెన్ వెల్నెస్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఎస్బీ సీఐ రమేష్, సైబర్ సెల్ సీఐ శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ సీఐ ఆదాం తదితరులు పాల్గొన్నారు.



కమాండ్ కంట్రోల్ రూమ్ ప్రారంభోత్సవంలో ఎస్పీ మాధవరెడ్డి తదితరులు

నిరంతరంగా యూరియా సరఫరా

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిరంతరంగా యూరియా సరఫరా చేయనున్నట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలతో తెలిపారు. ప్రస్తుతం 633 మెట్రిక్ టన్నులు యూరియా నిల్వలు రైతు సేవా కేంద్రాల వద్ద ఉన్నాయన్నారు. రానున్న పది రోజుల్లో మరో 2,500 మెట్రిక్ టన్నులు రానుందన్నారు. రైతుల వేలిముద్రలు వేసి, ఆధార్ ద్వారా యూరియా కొనుగోలు చేయాలన్నారు. అధిక ధరలకు యూరియా అమ్మితే మండల వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇతర సమస్యలేమైనా ఉంటే ఈ 94401 04317, 79894 34766 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు. పార్వతీపురం డివిజన్‌లో వారు 83310 56268, కురుపాం 83310 56266, పాలకొండ 83310 56206, సాలూరులో రైతులు ఈ 83310 56265 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

సత్వర గుర్తింపుతో క్యాన్సర్‌కు చెక్

- డీఎంహెచ్‌వో భాస్కరరావు



పార్వతీపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సత్వర గుర్తింపుతో క్యాన్సర్‌కు చెక్ పెట్టొచ్చని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు తెలిపారు. ఎన్‌సీడీ 4.0లో భాగంగా క్యాన్సర్ స్ర్కీనింగ్‌పై సీహెచ్‌వో, ఏఎన్‌ఎంలకు గురువారం ఎన్‌జీవో హోంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కువగా నోరు , రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు నమోదు అవుతున్నాయని తెలిపారు. వాటిని సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని చెప్పారు. ఆ తర్వాత గైనకాలజిస్ట్, డెంటల్ వైద్యులు పవర్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ పీవో జగన్మోహన్ , డీఐవో విజయమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కాఫీ తోటల పెంపకానికి ఏర్పాట్లు 5లో
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

యూరియాపై నిఘా ఉంచండి
- ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశం

నేటితో నామినేషన్‌కు గడువు పూర్తి 5లో
- ఎంపికైన ప్రభుత్వ కార్యాలయాలకు స్వచ్ఛాంధ్ర అవార్డులు

పంచాయతీలకు నిధులు



గరుగుబిల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 15 మండలాల పరిధిలోని పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు పంచాయతీల వెండర్ కోడ్‌తో పాటు డీడీవో కోడ్‌లకు జమ చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో విడతలో టైప్ గ్రాంటుగా రూ. 13.19కోట్లు, బేసిక్ అన్‌టైప్ గ్రాంటుగా రూ. 8.79 కోట్లు జమయ్యాయి. వాటితో గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు, సీసీ చార్జులు చెల్లించనున్నారు. పారిశుధ్యంతో పాటు తాగునీరు సరఫరాకు నిధులు వెచ్చించనున్నారు. పంచాయతీలకు సంబంధించి నిధులు జమయ్యాయని, కార్యదర్శులు ప్రాధాన్యం మేరకు వినియోగించాలని డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు తెలిపారు.

ఆశ్రమ పాఠశాల వార్డెన్‌పై విచారణ 5లో
- మరో టీచర్‌కు బాధ్యతలు

భక్తిశ్రద్ధలతో దీపారాధన 5లో

మన్యంలో వైద్య కళాశాల

- పార్వతీపురంలో ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- ఆమోదం తెలిపిన మంత్రి వర్గం



గరుగుబిల్లి: గత వైసీపీ సర్కారు హయాంలో ఉల్లిభద్ర సమీపంలో పరిశీలించిన స్థలం ఇలా..

పార్వతీపురం, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): జిల్లావాసులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. పార్వతీపురంలో వైద్య కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు గురువారం మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పీపీపీ విధానంలో రాష్ట్రంలో కొత్తగా పది వైద్య కళాశాలలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రెండు దశల్లో ఈ పనులు చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. కాగా దీనిపై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రకటనలకే పరిమితమైన వైసీపీ

జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటుపై గత వైసీపీ ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమైంది. అప్పటి ముఖ్యమంత్రి జగన్ కురుపాంలో జరిగిన ఒక సమావేశంలో దీనిపై స్పష్టమైన హామీ ఇచ్చినా అది నెరవేరలేదు. మన్యం జిల్లాకు వైద్య కళాశాల మంజూరు చేసిన ఘనత వైసీపీకే దక్కుతుందని అప్పటి పాలకులు గొప్పలు చెప్పుకున్నా.. పనులేవీ చేయించలేకపోయారు. వైద్య కళాశాల ఏర్పాటు కోసం నాటి అధికారులు, ప్రజాప్రతినిధులు గురుగుబిల్లి మండలం ఉల్లిభద్రలో స్థల సేకరణ అంటూ హడావుడి చేశారు. కానీ శంకుస్థాపన కూడా చేయలేకపోయారు. ఈ క్రమంలో జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటు ఆవశ్యకతను కూటమి ప్రభుత్వం గుర్తించింది. దీనిలో భాగంగానే మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. జిల్లావాసుల కల నెరవేర్చేలా అడుగులు వేయనుండడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఎంతో మందికి ఉపయోగం...

ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందనుంది. ప్రత్యక్షంగా పరోక్షంగా ఎంతో మందికి ఉపాధి లభించే అవకాశం ఉంది. జిల్లా కేంద్రంలో మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం కూడా

(మిగతా 5వ పేజీలో...)

ఆటో డ్రైవర్లకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

గజపతినగరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ గజపతినగరం సమితి జనరల్ సెక్రటరీ పురం అప్పారావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆటో డ్రైవర్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులకు గురి కావల్సి వస్తోందన్నారు. అనంతరం తహసీల్దార్ బి.రత్నకుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

జేఎన్‌టీయూతో నాస్కామ్ ఒప్పందం

విజయనగరం రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీలో ఉన్న నాస్కామ్ సంస్థ మధ్య ఒప్పందం కుదిరింది. గురువారం యూనివర్సిటీ వీసీ డి.రాజ్యలక్ష్మి పాల్గొని పరస్పర ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. వీసీ రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ జయసుమ, నాస్కామ్ డైరెక్టర్ ఉదయ్‌శంకర్, ప్రవీణ్‌తో పాటు కళాశాల విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు. జేఎన్‌టీయూ పరిధిలో ఉన్న అన్ని స్వయం ప్రతిపత్తి కళాశాలలు, అనుబంధ కళాశాలల నియామక అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేమూరి ఫౌండేషన్ సేవలు అభినందనీయం

విజయనగరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యాత్రికులతో భారత గౌరవ్ స్పెషల్ రైళ్లో పంచజ్యోతిర్లింగ క్షేత్రాలు, మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, భీమ్‌శంకర్, ఘృష్టీశ్వర్ దర్శనం కలిగిస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వేమూరి ఫౌండేషన్ సేవలు అభినందనీయమని రాష్ట్రీయ బ్రహ్మణ సంఘటన జాతీయ అధ్యక్షుడు జంధ్యాల బుచ్చిబాబు కొనియాడారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ యాత్రకు ఒక్కొక్కరికి రూ.23 వేలు చొప్పున సంస్థ తరపున 12 మందికి ఫౌండేషన్ వ్యయం చేసిందని తెలిపారు.

రామేశ్వరి కాలనీలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

గరివిడి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామేశ్వరి కాలనీలో వినాయక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు మూడు వేలమంది భక్తులు హాజరై అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు వాకాడ గోపీ, పి.కుమార్, వడ్రంగి రమేష్, నీలాద్రి సూర్యనారాయణ, తూట శ్రీను పాల్గొన్నారు.

మందుల కొరత రానీయకండి

చీపురుపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలో మందుల కొరత రానీయకుండా చూడాలని ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ సూచించారు. కర్లాం పీహెచ్‌సీలో గురువారం జరిగిన ఆసుపత్రి సలహా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. వర్షా కాలం కారణంగా గ్రామాల్లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యులు శ్రీలక్ష్మి, కృష్ణ, సర్పంచ్ భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానం చేయాలి

భోగాపురం, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): నేత్రదానం చేయడాన్ని ప్రతిఒక్కరూ కుటుంబ సంప్రదాయంగా పాటించాలని మోపాడ ఆప్తాల్మిక్ అధికారి మజ్జి గణపతిరావు సూచించారు. నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా భోగాపురంలో విజయనగరం అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంధులకు ఏటా సుమారు 2లక్షల కార్నియాలు అవసరం అవుతుండగా కేవలం 50 వేలు మాత్రమే సేకరిస్తున్నామని చెప్పారు.

రూ.50వేలు పలికిన గణేష్ లడ్డూ

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీతారాంపురంలో వినాయక నవరాత్రుల్లో భాగంగా గురువారం లడ్డూ వేలం పాట నిర్వహించగా, అదే గ్రామానికి చెందిన రెడ్డి చిన్నికృష్ణ అనే రైతు తన సహచర రైతులతో కలిసి రూ.50వేలకు దక్కించుకున్నారు. సర్పంచ్ చిన్నంనాయుడు లడ్డూ అందించారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

దత్తిరాజేరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పెదమానాపురం సంతతోటలో ఉన్న కొల్లా నరసింహస్వామి సన్స్ ఎరువుల దుకాణాన్ని విజిలెన్స్ సీఐ బి.సింహాచలం గురువారం తనిఖీ చేశారు. రికార్డులను, స్టాకును పరిశీలించారు. రైతులకు ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని, అంతకు మించి విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవో అనూరాధ ఉన్నారు.

నాణ్యమైన బోధన అందివ్వాలి

రేగిడి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సర్కారు బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందివ్వాలని ఎంఈవోలు వరప్రసాదరావు, బి.ఎరకయ్యలు ఉపాధ్యాయులకు సూచించారు. లింగాలవలస ప్రాథమిక పాఠశాలను వారు ఇతర ఉపాధ్యాయుల బృందంతో కలిసి గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు, వర్క్‌బుక్ నిర్వహణ, రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుంగిన కల్వర్టులు.. తప్పని కష్టాలు

- రహదారులపై ప్రవహిస్తున్న నీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



చంద్రంపేట వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు



సిరిపురంలో మూసుకుపోయిన కల్వర్టు వద్ద తవ్విన దృశ్యం

గంట్యాడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం, చంద్రంపేట గ్రామాలకు వెళ్లే రహదారిలో ఉన్న కల్వర్టులు కుంగిపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. గతంలో ఇక్కడి కల్వర్టులు మూసుకుపోయాయి. ఈ కారణంగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రహదారులపై నుంచి నీరు ప్రవహిస్తోంది. సిరిపురం నుంచి మురపాక, పెదవేమలి గ్రామాలకు వెళ్లే రహదారిలో ఉన్న కల్వర్టు పూర్తిగా మూసుకుపోయింది. ఇటీవల తమ చెరువు సాగునీరు తమ పొలాలకు రావడం లేదని కింద ఉన్న ఆయకట్టు రైతులు ఈ మూసుకుపోయిన కల్వర్టు వద్ద యంత్రాలతో తవ్వారు. దీంతో సిరిపురం గ్రామానికి సరఫరా అయిన తాగునీటి పైపులు దెబ్బతిన్నాయి. అలాగే రోడ్డు కూడా దెబ్బతిన్నది. దీంతో మురపాక, పెదవేమలి గ్రామాలకు వెళ్లడానికి ప్రయాణికులు చాలా ఇబ్బంది పడ్డారు. ఇదిలా ఉంటే చంద్రంపేట గ్రామం వద్ద కల్వర్టు కూడా దెబ్బతిన్నది. దీంతో రహదారిపై నుంచి నీరు వెళ్లాల్సి వచ్చింది. ఈ సమస్య వల్ల గ్రామస్థులు చాలా ఇబ్బంది పడ్డారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మరుగుదొడ్ల నిర్మాణం వేగవంతం చేయండి

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ సంక్షేమ వసతి గృహాలకు ఈ నెలాఖరు నాటికి మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా సంక్షేమ వసతి గృహాలకు మరుగుదొడ్ల సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 15 సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలకు మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉందన్నారు. బీసీ సంక్షేమ శాఖ ద్వారా 39 వసతి గృహాలకు మరుగుదొడ్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న 149 హాస్టళ్లలో ఎన్ని చోట్ల మరుగుదొడ్ల అవసరం ఉన్నాయో గుర్తించేందుకు సర్వే పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత, సోషల్ వెల్ఫేర్ డీడీ అన్నపూర్ణ, బీసీ సంక్షేమ అధికారి జ్యోతిశ్రీ, గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపుపై దృష్టి

రాష్ట్రమంతటా భూగర్భ జలాలు పెంపొందించే దిశగా సీఎం కృషి చేస్తున్నారని.. అందుకు అనుగుణంగా కలెక్టర్లు దృష్టి సారించాలని సీఎస్ విజయానంద్ ఆదేశించారు. గురువారం రాత్రి కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై ఆయన మాట్లాడారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని 215 గ్రామాల్లో చెరువులు, కల్వర్టుల మరమ్మతులకు త్వరితగతిన ప్రణాళిక తయారు చేయాలన్నారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేయాలని డ్వామా పీడీ, నీటి పారుదల అధికారులను ఆదేశించారు. జిల్లాలో రోజుకు 100 చెరువుల నిర్దేశించుకొని పనులు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో తగినంత యూరియా నిల్వలు ఉన్నాయని సీఎస్‌కు వివరించారు. ఈ సమావేశంలో జేసీ సేతు మాధవన్, సీపీవో బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

ఏ క్షణంలో కూలిపోతుందో..

- శిథిలావస్థలో ఎంపీడీవో కార్యాలయం



శ్లాబు నుంచి పెచ్చులూడిన దృశ్యం

గుర్ల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గుర్ల మండల పరిషత్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. శ్లాబ్ నుంచి పెచ్చులు ఊడి రాలిపోతున్నాయి. వర్షా కాలంలో శ్లాబు నుంచి నీటి చుక్కలు కారుతునే ఉంటాయి. ఈగలు, దోమలతోపాటు పాములు కూడా సంచరిస్తున్నాయి. అధికారులు లోపలికి వెళ్లాలంటే గుండె గుబేలుమంటుంది. ఏ క్షణం కూలిపోతుందోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు, నాయకులు తమ కుర్చీల మీద కుర్చుంటే పెచ్చులు రాలుతున్నాయి. పలుమార్లు మరమ్మతులు చేయించినా భవనం శిథిలావస్థకు చేరుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే నూతన భవనం ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆకట్టుకున్న వీణ కచేరీ



వీణ కచేరీ నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం బాబామెట్ట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో గురువారం నిర్వహించిన సంగీత కచేరీ ప్రేక్షకులను ఆకట్టుకుంది. విద్యార్థినులు గౌతమి, గ్రీష్మా, సుమతి, మంగా పలు గీతాలను వీణపై పలికించగా, వెంకటరావు మృదంగంపై వాయిద్య సహకారం అందించారు. అనంతరం చాగంటి రమ్య పలు గీతాలు ఆలపించగా, వయోలిన్‌పై రామచరణ్, మృదంగంపై ఏడుకొండలు వాయిద్య సహకారం అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.మండపాక నాగలక్ష్మి, సిబ్బంది, ఉపాధ్యాయులు, సిబ్బంది, కళాభిమానులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభను విజయవంతం చేయండి

లక్కవరపుకోట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాజాంలో ఈనెల 7, 8 తేదీలలో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని సీఐటీయు నేతలు గాడి అప్పారావు, తరిని వెంకటరమణ కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పోస్టర్ విడుదల చేశారు.

ప్రభుత్వం మారినా.. పేర్లు మారలే

- వెల్నెస్ కేంద్రాలపై ఇంకా వైఎస్సార్ పేరు



ఎం.కొత్తవలసలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

గజపతినగరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారినా గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన భవనాలపై ఉన్న నాటి పేర్లు మాత్రం అలాగే ఉన్నాయి. గత వైసీపీ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్మాన్ భారత్ హెల్త్‌అండ్ వెల్నెస్ వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లీనిక్ భారత్ నిర్మాణ్ సేవా కేంద్రం, రైతు భరోసా కేంద్రాల పేరుతో భవనాలను నిర్మించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్ పేరులో వైఎస్సార్ పేరును తొలగించి విలేజ్ హెల్త్‌క్లినిక్‌గా మార్పు చేశారు. అలాగే రైతుభరోసా పేరును మార్చి రైతుసేవా కేంద్రాలుగా మార్చింది. అయితే కొన్ని చోట్ల ఈ భవనాలపైన ఉన్న పేర్లు, జగన్ ఫొటోలను నేటికీ తొలగించలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆయా భవనాలపై పేరు మార్పుతో పాటు మాజీ ముఖ్యమంత్రి ఫొటోలను తొలగించే దిశగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



జగన్ ఫోటోతో దర్శనమిస్తున్న ఆర్‌బీకే

జమ్మాదేవిపేట ఎంజేపీ పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు

లక్కవరపుకోట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జమ్మాదేవిపేట వద్దగల మహాత్మా జ్యోతిబా ఫూలే బాలికల గురుకుల పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో సూపర్ స్కూల్‌గా గుర్తింపు లభించింది. ఈ పాఠశాల 2024-25 పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా 13 ఐఐఐటీ సీట్లు సాధించింది. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందాయి. అలాగే ఉపాధ్యాయిని జి.స్వప్నప్రియ లైబ్రరీని ఉత్తమంగా తీర్చిదిద్ది విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడడంతో ఆమెకు సూపర్ టీచర్ అవార్డు దక్కింది. వీటన్నింటి ఆధారంగా పాఠశాలకు 'ఎ' కేటగిరి ప్రకటించారు. ఈమేరకు బీసీ వెల్ఫేర్ రాష్ట్ర కార్యదర్శి పి.మాధవీలత చేతులమీదుగా గురువారం విజయవాడలో సూపర్ స్కూల్ అవార్డును అందజేశారు. అవార్డు రావడం పట్ల ప్రిన్సిపాల్ యూవీకే పాత్రో హర్షం వ్యక్తం చేశారు.

జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.దేవి మాధవి అన్నారు. సింహగిరి పారా మెడికల్ కళాశాలలో గురువారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, ప్రభుత్వ వైద్య కళాశాల హెచ్‌వోడీ డా.బ సుమిత్రదాస్, డా.జి.ప్రేమ్‌కుమార్, కళాశాల గౌరవ అధ్యక్షుడు ప్రకాష్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ దేవి మాధవి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వంగర, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వంగర సబ్ స్టేషన్ మడ్డువలస ఫీడర్‌లోని 11కేవీలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మడ్డువలస, అరసాడ, బాగెమ్మపేట, జగన్నాథవలస, పటువర్దనం, శ్రీహరిపురం గ్రామాలకు సరఫరా ఉండదని చెప్పారు. ● డెంకాడ: మండలంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ జి.సురేష్ బాబు తెలిపారు. మన్యం, గొలగాం, గంట్లాం, ఎస్సీ కాలనీ, డి.తాళ్లవలస, టి.కళ్లాలు, అక్కివరం తదితర గ్రామాలకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ● లక్కవరపుకోట: ఎల్.కోట సబ్ స్టేషన్ నిర్వహణ కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని విజయనగరం రూరల్ ఈఈ జి.సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గొల్జాం, కల్లెంపూడి, ఎల్‌కే ఎస్.పురం, ఓబలయ్యపాలెం, ముకుందపురం, ఎల్.కోట, ఖాసాపేట, తలారి, కొట్యాడ, కూర్మవరం, రంగరాయపురం, సంతపేట గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని చెప్పారు.

డ్రోన్ల పంపిణీ

వంగర, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతులు తమ వ్యవసాయంలో సాంకేతికత జోడిస్తే ఆర్థికంగా ప్రగతి సాధించగలరని ఏవో కన్నబాబు అన్నారు. గురువారం రాజులగుమ్మడ గ్రామంలో రైతులకు రైతుమిత్ర సంఘాల ద్వారా ఆయన డ్రోన్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయితీపై బ్యాంకులు ఇస్తున్న డ్రోన్లు వినియోగించుకోవాలన్నారు. రైతులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణతో సరిపెట్టకండి

- కొనసాగుతున్న జిందాల్ నిర్వాసితుల నిరసన

ఎస్.కోట రూరల్ సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): బొడ్డవరలో రెండు రోజుల కిందట నిర్వహించిన గ్రామసభ కేవలం వినతుల స్వీకరణ సభగా కాకుండా సమస్యల పరిష్కార సభగా మార్చాలని జిందాల్ నిర్వాసితులు కోరారు. గురువారం తమ 73వ రోజు నిరసనలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ పాల్గొని, మాట్లాడారు. ఈ గ్రామసభలో మెజార్టీ రైతులు తమ భూములు ఇప్పించాలని కోరుతున్నారని రైతుల భూములు వారికే ఇప్పించాలనీ కోరారు. ఒక తరం నాశనంచేసిన జిందాల్‌కు శతకోటి దండాలు అంటూ నమస్కారాలుచేశారు.

ఢిల్లీ నుంచి వచ్చిన నోటీసుల ఫలితమే..

బొడ్డవర గ్రామంలో రెండు రోజుల కిందట నిర్వహించిన గ్రామసభ తామ పోరాట ఫలితమే అని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కొద్దిరోజుల కిందట ఢిల్లీ వెళ్లి జాతీయ హ్యూమన్ రైట్స్, ఎస్సీ, ఎస్టీ కమిషన్, వినియోగదారుల ఫోరం చైర్మన్‌ల ను కలిసి ఇక్కడ జరుగుతున్న పరిణామాలు వివరిం చామన్నారు. అక్కడ ఆదేశాలతో గ్రామసభ నిర్వహించినట్టు భావిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా స్పందించిన అధికారులకు ధన్యవాదాలని అన్నారు.



భూములు ఇచ్చి నష్టపోయామని దండాలు పెడుతున్న నిర్వాసితులు

వ్యాను ఢీకొని యువకుడి మృతి

- ఇద్దరికి గాయాలు

బొండపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): బొండపల్లి గ్రామంలో పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై స్థానిక ఎస్ఐ యు.మహేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మక్కువ మండలం వెంకటభైరిపురం గ్రామానికి చెందిన దాసరి సాయి(20), ఆకుల రాజేష్, నడిపల్లి రఘు అనే ముగ్గురు యువకులు విజయనగరం నుంచి తమ గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న వ్యాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ సాయి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ యు.మహేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ఢీకొని ఒకరు..

లక్కవరపుకోట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగరాయపురం జంక్షన్ సమీపంలో బైకు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో బైకిస్టు అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. వేపాడ మండలం చామలాపల్లి గ్రామానికి చెందిన పెద్దాడ అర్జునరావు(32) విశాఖ జిల్లా చినముసిడివాడలో భార్య, కుమారునితో కలిసి నివాసం ఉంటున్నాడు. గురువారం రాత్రికి తమ స్వగ్రామంలోని వినాయక నిమజ్జనం కార్యక్రమానికి హాజరు కావడానికి విశాఖ నుంచి వస్తున్నాడు. ఎల్.కోట మండలం రంగరాయపురం జంక్షన్ సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ఈ ఘటనపై ఎస్ఐ నవీన్‌పడాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'స్వర్ణాంధ్ర'కు సహకరించండి



పారిశుధ్య వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. గురువారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నూతనంగా కొనుగోలు చేసిన పారిశుధ్య వాహనాలను ఆమె ప్రారంభించారు. ఒక ఎక్స్‌కవేటర్, ఎనిమిది ట్రాక్టర్లు, రెండు కాంపాక్టర్ వాహనాలను ప్రారంభించి, వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ3.57 కోట్లతో పారిశుధ్య వాహనాలను సమకూర్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ నల్లనయ్య, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, ఈఈ ప్రసాద్, డీఈలు, పారిశుధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

నమూనాలు ల్యాబ్‌కు పంపించాం

- కోళ్లకు సోకిన వ్యాధి నిర్ధారణపై పరిశోధనలు
- పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ దామోదరరావు



మాట్లాడుతున్న దామోదరరావు

కొత్తవలస, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కోళ్ల మృతి చెందడానికి గల కారణాలపై నమూనాలు సేకరించి విజయవాడలోని ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించినట్లు పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.దామోదరరావు తెలిపారు. ప్రస్తుతం కోళ్ల మృతికి సంబంధించి ఎటువంటి వ్యాధి సోకిందన్న విషయం ఇంకా నిర్ధారణ కాలేదని చెప్పారు. ఇటీవల అంతు చిక్కని వ్యాధితో కొత్తవలస పౌల్ట్రీ జోన్‌లోని కొత్తవలస, లక్కవరపుకోట మండలాలతోపాటు మరికొన్ని మండలాల్లో లక్షల సంఖ్యలో కోళ్లు మృతి చెందిన విషయం విదితమే. ఈనేపథ్యంలోగురువారం కొత్తవలసలోని ఏడీ కార్యాలయంలో దామోదరరావు విలేకరులతో మాట్లాడారు. ల్యాబ్ నుంచి పరీక్షలకు సంబంధించిన నివేదికలు ఇంకా రాకపోవడంతో గ్రామాల్లో ప్రజలు తమ ఇళ్ల వద్ద పెంచుతున్న కోళ్లకు సంబంధించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కోళ్లను బయటకు విడిచిపెట్టవద్దని సూచించారు. కోళ్లతోపాటు పక్షి జాతులు చనిపోతే గ్రామానికి దూరంగా గోతులు తీసి ఖననంచేయాలని, ఎక్కడపడితే అక్కడ పారవేయవద్దని సూచించారు. కోళ్ల ఫారాల్లో ప్రతి రోజూ సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని, రెండు మూడు నెలల వరకు కోళ్ల పెంపకం నిలిపివేయడం శ్రేయస్కరమన్నారు. కోళ్ల పెంపకందారులు కూడా కరోనా సమయంలో శానిటైజ్ చేసుకోవడం వంటి తీసుకున్న జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కోళ్లఫారాల్లోకి వెళ్లే ముందు, వచ్చే ముందుకు శరీరమంతా శానిటైజ్ చేసుకోవాలని తెలిపారు. చనిపోయిన కోళ్లను ఖననం చేసిన తర్వాత కూడా శానిటైజ్ చేసుకోవాలన్నారు. కోళ్లకు సోకిన వ్యాధి ఎక్కడ నుంచి ఎలా వచ్చిందన్న విషయంపై నిర్ధారణకు పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కొత్తవలస ఏడీ కన్నంనాయుడుతో పాటు వివిధ పశువైద్యశాలల వైద్యాధికారులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

కొత్తవలస, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రోజురోజుకు సైబర్ మోసాలు పెరిగిపోతున్నందున ఖాతాదారులు తమ బ్యాంకు ఖాతాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ (కార్పొరేట్ సెంటర్, ముంబయి) సత్యేంద్ర కుమార్ సింగ్ అన్నారు. గురువారం దేశపాత్రునిపాలెం సమీపంలో ఒక కల్యాణమండపంలో మండలంలోని వివిధ మహిళా సంఘాలతో ఏర్పాటుచేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్‌లకు అనుమానస్పద లింక్‌లు వస్తే ఎట్టి పరిస్థితులలోను క్లిక్ చేయొద్దని సూచన చేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐకి చెందిన డిప్యూటీ జనరల్ మేనేజర్ సంక్రిత్య, రీజనల్ మేనేజర్ సురేష్‌బాబు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణమూర్తి, కొత్తవలస బ్రాంచి మేనేజర్ టి.శ్రీనివాస్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కె.శ్రీదేవి, ఏపీఎం వెంకటరమణ, సీసీలు నాయుడు, స్వామి, పద్మ, 300 మంది మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోండి

గుర్ల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని గరివిడి ఐసీడీఎస్ పీవో ఆరుద్ర అన్నారు. గురువారం కెల్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆమె బాలికలకు, గర్భిణులకు, మహిళలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వన్ స్టాప్ సెంటర్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, సఖీ నివాస్, శక్తి సదన్, 181 ఉమెన్ హెల్ప్‌లైన్, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. సీడీపీవో ఎస్.ఆరుద్ర, డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ ఎల్.సుజాత, సీఏ పి.సాయి విజయలక్ష్మి, సఖి సిబ్బంది పాల్గొన్నారు

మన్యంలో వైద్య కళాశాల

(3వ పేజీ తరువాయి)

ఊపందుకోవడంతో మన్యం వాసులకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. ఇకపై పొరుగు జిల్లాలకు పరుగులు పెట్టాల్సిన అవసరం ఉండదు. జిల్లా విద్యార్థులు స్థానికంగానే వైద్య విద్యనభ్యసించే వీలు కలుగుతుంది.

సీఎం ప్రత్యేక దృష్టి

'సీఎం చంద్రబాబునాయుడు మన్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాకు పీపీపీ పద్ధతిలో వైద్య కళాశాల మంజూరు చేశారు. దీనికి మంత్రివర్గం ఆమోదం తెలపడం చాలా ఆనందంగా ఉంది. గత ప్రభుత్వం వైద్య కళాశాల మంజూరు చేస్తున్నట్టు ప్రకటించి ప్రజలను మోసం చేసింది. తాజాగా కూటమి ప్రభుత్వ నిర్ణయంతో జిల్లా ప్రజలకు ఎంతో మేలు కలగనుంది. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది.' అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ జగదీశ్వరి, పార్వతీపురం, పాలకొండ ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ తెలిపారు.

గర్భిణి మృతిపై విచారణ

పాలకొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ఏరియా ఆసుపత్రిలో గత నెల 27న గర్భిణి మృతి చెందింది. ఆ ఘటనపై గురువారం విచారణ చేపట్టారు. పార్వతీపురం, సీతంపేట ఏరియా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు జయశ్రీ, శ్రీనివాసరావు విచారణ చేశారు. గర్భిణి మృతికి గల కారణాలను వైద్యులు, ఆశ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. విచారణలో స్థానిక వైద్యులు రవికుమార్, భారతి ఉన్నారు.

నేటితో నామినేషన్‌కు గడువు పూర్తి

పార్వతీపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాల నామినేషన్లను శుక్రవారంలోగా సమర్పించాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర అవార్డులు ప్రకటించనుందన్నారు. అందులో భాగం గా స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛత, ఎన్‌జీవోల విభాగంలో దరఖాస్తులను సాయంత్రం 5 గంటల్లోగా 8074700468కు వాట్సాప్‌లో పంపించాలని కలెక్టర్ కోరారు.

రేపు గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన

పార్వతీపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గురుగుబిల్లిలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల కళాశాలలో శనివారం విద్యార్థులకు గుడ్ టచ్- బ్యాడ్ టచ్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నామని రెండో అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ అధ్యక్షుడు ఎస్.దామోదరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు, పిల్లలకు అవగాహన కల్పించేందుకు ముఖ్యమైన సలహాలు, సూచనలు ఇవ్వనున్నామని ఆయన పేర్కొన్నారు.

నానో యూరియా, డీఏపీ వాడండి

వీరఘట్టం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విక్రంపురంలో గురువారం నానో యూరియా, నానో డీఏపీ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను ఏవో సౌజన్య రైతులకు వివరించారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియాను వాడాలన్నారు. కార్య క్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

కృషి యోగా కేంద్రానికి స్థలం రిజిస్ట్రేషన్


రిజిస్ట్రార్ కార్యాలయంలో కొండలరావు

పాలకొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కృషి యోగా కేంద్రం ఏర్పాటునకు టీడీపీ సీనియర్ నాయకుడు పల్లా కొండలరావు స్థలాన్ని దానం చేశారు. అందుకు సంబంధించిన స్థలానికి గురువారం రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో తన తల్లిదండ్రులు పల్లా బాబ్జీ, సూరమ్మ పేర్లు చిరస్థాయిగా ఉండాలనే ఆలోచనతో స్థలాన్ని దానం చేశానన్నారు.

అంతర పంటలపై శిక్షణ

సీతంపేట రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జీడిమామిడిలో వేసుకోవాల్సిన అంతర పంటలపై గిరిజన రైతులకు గురువారం ఇప్పగూడలో శిక్షణ తరగతులు నిర్వహించారు. రస్తకుంటుబాయి ఉద్యాన కేంద్రం నుంచి వచ్చిన శాస్త్రవేత్త డా.శ్రీనివాసరాజు పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. జీడిమామిడిలో గిరిజన రైతులు వేసుకోవాల్సిన పసుపు, పైనాపిల్ సాగు విధానంపై వివరించారు. గిరిజన గ్రామంలో రైతులు వేసిన మారిషస్ రకానికి చెందిన పైనాపిల్, కేవీకే ద్వారా రైతులకు ఇచ్చిన పసుపు పంటలను పరిశీలించారు. ఉద్యానశాఖ ద్వారా గిరిజన రైతులకు అందించే పథకాలపై హెచ్‌వో జయశ్రీ రైతులకు వివరించారు. శిక్షణ తరగతుల్లో పీహెచ్‌వో ఆర్‌వీ గణేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే జైలు

మక్కువ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడితే జైలు శిక్ష తప్పదని మక్కువ ఎస్ఐ ఎం.వెంకటరమణమూర్తి హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ గడిచిన మూడు నెలల్లో 80 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు. ఇంతవరకు 27 కేసులను కోర్టులో హాజరుపర్చి రూ.2.70 లక్షలు జరిమానా కట్టించామన్నారు. అదే కేసులో రెండోసారి పట్టుబడితే జైలు శిక్షతో పాటు వాహన చోదకుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

బాధ్యతగా వ్యవహరించండి

గరుగుబిల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో సచివాలయాల కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించి తగిన గుర్తింపు పొందాలని ఎంపీపీ ఉరిటి రామారావు, ఎంపీడీవో జి.పైడితల్లి, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు సూచించారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో బదిలీపై వెళ్లిన, విధుల్లోకి చేరిన సచివాలయ కార్యదర్శులను సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలన్నారు. పంచాయతీల పరిధిలో సర్పంచ్‌లతో సమన్వయంగా మెలిగి సమస్యలు లేని పంచాయతీలుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఏవో ఎన్.అర్జునరావు, ఉపాధి ఏపీవో ఈశ్వరమ్మ, కార్యదర్శుల సంఘ ప్రతినిధులు టి.భాస్కరరావు, బి.అప్పారావు, ఆర్.శశిభూషణరావు, రావుపల్లి సర్పంచ్ బి.మహేష్, సిబ్బంది బి.శ్రీనివాసరావు, జి.కృష్ణప్రసాద్, కులశేఖర్, దాలినాయుడు పాల్గొన్నారు.

ఎరువులు ఇవ్వండి

భామిని, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎరువులు అందించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం రైతులు నినాదాలు చేశారు. ప్రైవేటు డీలర్లకు కేటాయించిన ఎరువులు ఇతర ప్రాంతానికి తరలించడంతో కొరత ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులను అందించాలన్నారు. ఈ సందర్భంగా డీటీ ఎ.శంకరరాయుడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బి.అప్పల నాయుడు, కె.భానుమూర్తి, రైతులు పాల్గొన్నారు.

పెద్దవీధిలో అన్నసమారాధన


అన్న ప్రసాదాలను స్వీకరిస్తున్న భక్తులు

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని కొత్త వలస పెద్దవీధిలో కొత్తపోలమ్మ యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన వినాయమక మండపంలో గురువారం అన్నసమారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అన్న ప్రసాదాలను స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన

మక్కువ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక జంగాల వీధిలోని వినాయక మండపంలో గురువారం మహా దీపారాధనను ఘనంగా నిర్వహించారు. మహిళలు వివిధ ఆకృతుల్లో దీపాలను అలంకరించారు. కార్యక్రమంలో జంగాలవీధి యువత, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● కురుపాం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వంగర వీధిలో ఏర్పాటు చేసిన గణేశ మండపంలో గురువారం దీపారాధనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లలితా సహస్ర నామ పారాయణం చేశారు. మండపం ఆవరణలో మధ్యాహ్నం అన్న సమారాధన చేశారు. అధికసంఖ్యలో భక్తులు అన్నప్రసాదాలను స్వీకరించారు.


మక్కువ జంగాల వీధిలో..


కురుపాం వంగర వీధిలో..

వినాయక లడ్డూ రూ.75,699

కురుపాం, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి) కురుపాంలో కళింగ వైశ్య సంఘం ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గురువారం స్వామివారి లడ్డూ ప్రసాదానికి గురువారం రాత్రి వేలం పాటను నిర్వహించారు. వేలం పాటలో వినాయక లడ్డూను రూ.75,699. చిన్నారి త్రినాథరావు వారి కుమారులు దక్కించుకున్నారు. వైశ్య సంఘం అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు, సంఘ పెద్దల సమక్షంలో వేలం పాట జరిగింది.

వేలం వేసిన లడ్డూ ప్రసాదం



కుంకుమ పూజల్లో ఎమ్మెల్యే


పూజలు నిర్వహిస్తున్న జగదీశ్వరి దంపతులు

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొండవీధిలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో గురువారం నిర్వహించిన కుంకుమ పూజల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి దంపతులు పాల్గొన్నారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సర్పంచ్ బొత్సాడ గౌరీశంకరరావు, టీడీపీ నాయకులు రాజేష్, రామారావు, లోవరాజు, మన్మథ, మనోహర్, ఉత్సవ కమిటీ సభ్యులు, యువత పాల్గొన్నారు.

డైరెక్టర్లకు అభినందనలు

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నియమించిన ఎస్టీ కమిషన్ డైరెక్టర్ కడ్రక మల్లేశ్వరరావు, నాటక అకా డమీ డైరెక్టర్ అంబటి తవిటినాయుడులను గురువారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అభినం దించారు. అనంతరం వారిని సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మా ట్లాడుతూ క్షేత్రస్థాయిలో కష్టించి పనిచేసేవారికి పార్టీలో గుర్తింపుతో పాటు మంచి పదవులు దక్కుతాయన్నారు. కార్యక్రమంలో కొప్పల వెలమ డైరెక్టర్ అక్కేన మధుసూదనరావు, ఏఎంసీ ఛైర్‌పర్సన్ కడ్రక కళావతి, టీడీపీ మండల అధ్యక్షుడు అడ్డాకుల నరేష్, కూటమి నాయకులు మండంగి భూషణ్‌రావు, కోలా రంజిత్‌కుమార్, కడ్రక అప్పలస్వామి, క్రాంతికుమార్, దాసు, లోవరాజు, మురళీ పాల్గొన్నారు.

నాటక అకాడమీ డైరెక్టర్‌గా రాంబాబు

గరుగుబిల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నాటక అకాడమి డైరెక్టర్‌గా సంతోషపురం సర్పంచ్ అంబటి తవిటినాయుడు (రాంబాబు)ను ప్రభుత్వం నియమించింది. రాంబాబు మండల పార్టీ అధ్యక్షుడిగా, మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా, సర్పంచ్‌గా కొనసాగారు. మండలంలో ప్రజాభిమానాన్ని పొందిన వ్యక్తిగా ఆయనకు గుర్తింపు ఉంది. గురువారం రాంబాబును గుమ్మలక్ష్మీపురంలో విప్ జగదీశ్వరి సత్కరించారు. ఈ సందర్భంగా రాంబాబును పలువురు అభినందించారు.

చెత్తను తొలగించి.. నీటిని నింపి


శివ్వాంలో నీటి తొట్టెను ఉపయోగంలోకి తెచ్చిన దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గరుగుబిల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని నీటి తొట్టెలను ఉపయోగంలోకి తీసుకొచ్చే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఇలానే వదిలేస్తారా..?' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. తొట్టెల్లో నీటిని నింపే ఏర్పాట్లు చేపట్టాలని మండల అధికారులను ఆదేశించారు. దాంతో గురువారం ఉదయం మండలంలోని శివ్వాంలో నీటి తొట్టెలోని చెత్తను తొలగించి నీటిని నింపించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జి.పైడితల్లి, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు మాట్లాడుతూ తొట్టెల్లో నీటి నిర్వహణ విషయమై సంబంధిత సచివాలయాల సిబ్బంది, ఉపాధి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు.

8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. పనులను మన్యం జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం ఈఈ గోపాల నాయుడు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు వల్ల లోవోల్టేజీ సమస్యతో పాటు నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించండి


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

వీరఘట్టం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం పోలీస్‌స్టేషన్‌ను గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి సందర్శించారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. డ్రగ్స్, సైబర్ నేరాలు, మోసపూరితమైన ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ముందుగా పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు, సీఐ చంద్రమౌళి, వీరఘట్టం ఎస్ఐ కళాధర్.. ఎస్పీకి సాదర స్వాగతం పలికారు. అనంతరం పాలకొండ సర్కిల్ కార్యాలయంలో రికార్డులు నిర్వహణ పరిశీలించారు. సిబ్బంది విధులు పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాలకొండ, సీతంపేట, దోనుబాయి ఎస్ఐలు ప్రయోగమూర్తి, అమ్మన్నరావు, మస్తాన్ ఉన్నారు.

గాయపడిన యువకుడికి ఆర్థిక సాయం

కురుపాం,సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో గాయాలపాలై విశాఖలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మంతి నివలసకు డ్రైవర్ కోన మురళికి పలువురు అండగా నిలిచారు. మురళీ కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో వాట్సాప్ గ్రూప్ ద్వారా విషయం తెలుసుకున్న పలువురు దాతలు స్పందించారు. గురువారం రూ. 28,200 నగదును ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు.

వైద్య కళాశాల మంజూరుపై హర్షం


ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరు చేయడం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను గతంలో అసెంబ్లీలో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని ప్రస్తావించానన్నారు. అనేక పర్యాయాలు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌లను కలిసి వినతిపత్రాలు అందజేశానన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి పార్వతీపురానికి వైద్య కళాశాల మంజూరు చేసిందన్నారు. బుధవారం మంత్రివర్గం సమావేశంలో పీపీపీ పద్ధతిలో వైద్య కళాశాల ఏర్పాటుకు మంత్రి వర్గం ఆమోద ముద్ర వేయడం ఆనందంగా ఉందన్నారు. పార్వతీపురానికి వైద్య కళాశాల మంజూరు చేయడం ఈ ప్రాంత ప్రజలు చిరకాల కోరిక కూటమి ప్రభుత్వం హయాంలో నెరవేరడం హర్షణీయమన్నారు. జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

ఆశ్రమ పాఠశాల వార్డెన్‌పై విచారణ


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐటీడీఏ డీడీ

సాలూరు రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కురుకూటి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల వార్డెన్ లిల్లీని వెనక్కి పంపించి మరో టీచర్ శ్రీదేవికి ఆ బాధ్యతలను ఐటీడీఏ డీడీ కృష్ణవేణి అప్పగించారు. వార్డెన్‌పై వచ్చిన ఆరోపణలపై గురువారం ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) ఆర్.కృష్ణవేణి విచారణ చేపట్టారు. వార్డెన్ లిల్లీ విద్యార్థినులను కొడుతున్నట్టు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆమె విచారణ చేశారు. వార్డెన్ లిల్లీ తీరుపై విద్యార్థినులతోను, ఉపాధ్యాయ సిబ్బందితో ను ప్రత్యేకంగా మాట్లాడారు. విద్యార్థినులు వార్డెన్ లిల్లీకి వ్యతిరేకంగా చెప్పారు. దీంతో బాధ్యతల నుంచి వెనక్కి పంపించి మరో టీచర్ శ్రీదేవికి అప్పగించారు. అనంతరం ఉపాధ్యాయ సిబ్బంది సమావేశంలో డీడీ కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉపాధ్యాయులు వ్యవహరించాలన్నారు. విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ చూపాలని చెప్పారు.

మెండెంఖల్లును మండలంగా మార్చండి


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

కురుపాం రూరల్/గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మెండెంఖల్లు కేంద్రంగా నూతన మండలాన్ని ఏర్పాటు చేయాలని ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణారావు కోరారు. గురువారం పాలకొండ సబ్ కలెక్టర్ స్వప్నిల్ జగన్నాథ్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఇటీవల ప్రభుత్వం నూతన జిల్లాలు, మండలాల ఏర్పాటు సరిహద్దులు మార్చేందుకు నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. కురపాం మండలం తూర్పు ముఠా ప్రాంతానికి చెందిన ఆదివాసీలు కురుపాం మండల కేంద్రానికి రావాలంటే సుమారుగా 50 నుంచి 60 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందన్నారు. మెండెంఖల్లు నూతన మండలం ఏర్పాటైతే పరిపాలనాపరంగా బాగుంటుందన్నారు. ఆయనతో పాటు బిడ్డిక రామ్మోహన్ ఉన్నారు.

బకాయి వేతనాలు చెల్లించండి


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కురుపాం/గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కురు పాం, గుమ్మలక్ష్మీపురం మండలాల పరిధిలోని పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.మన్మథరావు, బి.వి.రమణ డిమాండ్ చేశారు. గురువారం కురపాం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సమంజసం కాదన్నారు. కార్య క్రమంలో కురపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల గ్రీన్ అంబాసిడర్ల యూనియన్ నాయకులు బిడ్డిక మాస, పెంటయ్య, బిడ్డిక ప్రసాద్, మిన్నారావు, పాండు పాల్గొన్నారు.

పాలకొండలో తాగునీటికి ఇబ్బంది

పాలకొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీలో వాటర్ పంపింగ్‌కు సంబంధించిన సమస్య తలెత్తిన నేపథ్యంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలగనుందని నగర పంచాయతీ కమిషనర్ రత్నంరాజు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నాగావళి నది ఉధృతి వల్ల పంప్ హౌస్ వద్దకు వెళ్లి బాగుచేసే పరిస్థితి లేదన్నారు. నదిలో నీటి ఉధృతి తగ్గిన తర్వాత ఇంజనీరింగ్ సిబ్బంది మరమ్మతులు చేస్తారన్నారు. ఈ నేపథ్యంలో 9, 10, 11, 12, 13, 14, 15, 16, 17, 18 వార్డుల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన వివరించారు.

సైబీరియా పక్షుల విడిది స్థల పరిశీలన

సీతానగరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏటా జూన్‌లో సైబీరియా పక్షులు చెల్లంనాయుడువలస గ్రామానికి విడిదికి వస్తున్న నేపథ్యంలో గురువారం ఆ ప్రాంతాన్ని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో మాట్లాడారు. పక్షులు, గ్రామంలో సమస్యల పై ఆరా తీశారు.

గణేశుడికి 60 రకాల నైవేద్యం


స్వామికి నివేదించిన నైవేద్యం

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోటుపర్తి వారి వీధిలో ఏర్పాటు చేసిన మండపంలో అనంత పద్మనాభరూపంలో ఉన్న వినాయకుడికి గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కమిటీ సభ్యులు 60 రకాల నైవేద్యం స్వామివారికి సమర్పించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కాఫీ తోటల పెంపకానికి ఏర్పాట్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాచిపెంట మండల పరిధిలో కాఫీ తోటల పెంపకానికి తగిన ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. 'ప్రోత్సహిస్తే సిరులు పంట' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇక్కడ సత్ఫలితాలు ఇచ్చిన తర్వాత మిగతా గిరిజన మండలాల్లో కాఫీ తోటల పెంపకానికి గిరిజన రైతులను ప్రోత్సహిస్తామన్నారు. కాఫీ తోటల పెంపకంపై ఇప్పటికే శాస్త్రవేత్తలు, ఇతర అధికారులతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు.

యూరియాపై నిఘా ఉంచండి

పార్వతీపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యూరియాపై నిఘా ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధికారులను ఆదేశించారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, భూగర్భజలాలు, స్వచ్ఛంద్ర అవార్డులు అంశాలపై గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి.. కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. యూరియా నిల్వలు ఉన్నాయని, ఎటువంటి ఆందోళనలు అవసరం లేదన్నారు. రైతులకు అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల కోసం ఉత్తమ ప్రభుత్వ కార్యాలయాలు, ఎన్‌జీవోలు, పాఠశాలలు, మున్సిపాలిటీలు, పంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుప త్రులు తదితర రంగాల నుంచి దరఖాస్తులను సమర్పించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ యూరియా సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, డిప్యూటీ కలెక్టర్లు పి.ధర్మాచంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, డీఎంహెచ్‌వో భాస్కరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 33/11 కెవి నవగాం పరిధిలో ఉండే గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగనుందని ట్రాన్స్‌కో ఏఈ కె.విష్ణుమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. తుమరాడ, భాసూరు, ఎం.సింగుపురం, బడ్డుమాసంగి, గోపాలపురం, ఓని, వాటపాగు, అట్టలి, చిన్నమంగళాపురం, గొట్ట మంగళాపురం, పనుకువలస, బెజ్జి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు.

●జియ్యమ్మవలస, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెద మేరంగి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకు వెళ్లే 33 కేవీ ఏబీ స్విచ్ నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో శక్రవారం అంతరాయం కలగనుందని ఏఈ బి.శంకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 33 కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలను తొలగిస్తామన్నారు. అందుకుగానూ ఉదయం 8.30నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలగనుందని పేర్కొన్నారు.

●భామిని, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక 11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. పసుకుడి, బురుజోల, మండ్రంగూడ, బాలేరు, కొరమ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

●కురుపాం, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నుంచి గుమ్మలక్ష్మీపురం వెళ్లే 33 కేవీ లైన్‌లో నిర్వహణ పనులు, కురుపాం సబ్ స్టేషన్‌లో మరమత్తుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలివేయనున్నామని ఏఈ కోటేశ్వరరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సారా రహిత మండలంగా సీతంపేట


సారా నిర్మూలనపై సమావేశమైన మండల కమిటీ సభ్యులు

సీతంపేట రూరల్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మండలాన్ని సారా రహిత మండలంగా ప్రకటించామని పాలకొండ సీఐ సూర్యకుమారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ ఆధ్వర్యంలో మండల స్థాయి కమిటీ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయం 2.0లో భాగంగా మండలంలోని 13 గ్రామాలను సారా ప్రభావిత గ్రామాలుగా గుర్తించి ఆ గ్రామాల్లో వీఎల్‌సీల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించామన్నారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీకన్య, ఎంపీడీవో మిశ్రో, ఎస్ఐ అమ్మనరావు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.


కన్నతండ్రే కాలయముడు


హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్న బంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందం అచ్చంపేట చేరుకుంది.

లోకం తీరు



ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్లు దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో 'హెడ్ ఆఫ్ బ్రాండ్స్'గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థికమంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

- జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతోపాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తనపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.


ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్ కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40 మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పది మంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.

ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోఢా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లకెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ.2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ ఆర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్గియో ఆర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్గియో ఆర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుది శ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారం గా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.

బోధనలో మేటి మాస్టార్లు

- ఆ ఉపాధ్యాయులది ప్రత్యేక శైలి
- అంకితభావంతో గుర్తింపు
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం

సమాజంలో ఉపాధ్యాయుడిది ప్రత్యేక స్థానం. ఉపాధ్యాయ వృత్తికి ప్రత్యేక గౌరవం. తమదైన బోధనా తీరుతో విద్యార్థులను తీర్చిదిద్దుతూ.. ఇటు తల్లిదండ్రుల ప్రశంసలు... అటు ప్రభుత్వ పురస్కారాలు అందుకుంటున్న వారు ఎందరో ఉన్నారు. కొందరు అవార్డులు... రివార్డులు రాకపోయినా సేవలందిస్తున్నారు. నేడు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొందరు గురువుల గురించి తెలుసుకుందాం.

ఆటపాటలతో బోధిస్తూ...


కృత్యాలతో బోధిస్తున్న ఉషారాణి

బొబ్బిలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని తారకరామాకాలనీ మున్సిపల్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయినిగా పనిచేస్తున్న చిట్టిమోజు ఉషారాణి బోధనలో ప్రత్యేక శైలిని ప్రదర్శిస్తున్నారు. ఆటపాటల ద్వారా పాఠ్యాంశాలను బోధిస్తూ విద్యార్థులను ఆకట్టుకుంటున్నారు. మై స్మార్ట్ క్లాస్ వెబ్‌సైట్‌ను రూపొందించడంతో విద్యార్థులంతా ట్రయల్ అండ్ ఎర్రర్ మోడ్‌లో పాఠాలు నేర్చుకుంటున్నారు. మొబైల్ ఫోన్లలో అనవసరమైన వాటి నుంచి పిల్లల దృష్టిని మరల్చడానికి ఆమె ఈ విధానాన్ని ఎన్నుకున్నారు. విదేశీయులతో పాటు ఉపాధ్యాయ కోర్సులు శిక్షణ పొందుతున్న వారు సైతం ఈ వైబ్‌సైట్‌ను ఫాలో అవుతున్నారు. అక్షరమాలపై సొంతంగా పాటలు రాశారు. గత ఏడాది రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డు కింద ప్రభుత్వం ఇచ్చిన రూ.20 వేల నగదుతో ప్రభుత్వ పాఠశాల విద్యా ర్థులకు కొత్తదుస్తులు అందించారు. పిల్లలకు సులభతరంగా అర్థమయ్యేరీతిలో బొమ్మలు, ప్రాజెక్టులు, పాటలు, పెయింటింగ్స్ వంటి వాటితో అర్థవంతంగా బోధిస్తున్నారు.

పుస్తకాలకే పరిమితం కాకుండా..

గరుగుబిల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థి స్థాయికి వచ్చినప్పుడే వారి మనసుల్లో నిలిచిపోతారని నమ్ముతున్నారు కొత్తూరు పాఠశాల ఉపాధ్యాయులు వంగపండు ధనుంజయ నాయుడు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు పుస్తకాలతో పాటు ఆడియో విజువల్ సాధనాలతో బోధన అందిస్తున్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను బయటకు తీసుకు రావడానికి వివిధ ప్రయోగాలు చేయిస్తుంటారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా బోధించేందుకు ప్రయత్నిస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. విద్యార్థులతో మమేకమై బోధించడంలో ఆయన ముందు వరుసలో ఉంటున్నారు.


వంగపండు ధనుంజయనాయుడు

తెలుగుకు కళలను అద్ది...

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధన... మానవీయ విలువలు ఉండాలంటారు కొమరాడ మండలం అర్తాం పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కంచుమోజు రామ్మోహనరావు. గరుగుబిల్లి మండలం చిలకాం ఉన్నత పాఠశాలలో పనిచేసిన ఆయన ఇటీవల అర్తాం పాఠశాలకు బదిలీపై వెళ్లారు. తెలుగు భాషను కళల రూపంలో బోధించడం ఆయన ప్రత్యేకత. వివిధ కళారూపాలను విద్యార్థులకు నేర్పించి... వారికి అర్థమయ్యే రీతిలో బోధిస్తుంటారు. అవసరమైన విద్యా సామగ్రిని ఆయనే సొంతంగా సమకూర్చి.. పిల్లలకు చదువుపై ఆసక్తి కల్పిస్తారు. పాఠశాలల్లో బోధనతో పాటు పచ్చదనం పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పిస్తుంటారు. శిథిల భవనాలకు మరమ్మతులు నిర్వహించేందుకు సొంత నిధులను కేటాయిస్తుంటారు. ప్రభుత్వ పాఠ్య పుస్తకాలతో పాటు ఆధ్యాత్మిక ప్రవచనాలు, గీతా పారాయణం, భాగవత సప్తాహం వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తుంటారు.


కంచుమోజు రామ్మోహనరావు


ప్రొఫెసర్ రంజనా అగర్వాల్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న వేణుగోపాల్

ప్రతిభకు గుర్తింపు దక్కేలా..

రాజాం రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆయనో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు. ఏ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసినా.. అక్కడి విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు కృషి చేయడం ఆయన ప్రత్యేకత. విద్యార్థులను జిల్లా, రాష్ట్ర స్థాయిలలో వివిధ అంశాలలో ప్రతిభ చూపేలా తీర్చిదిద్దుతుంటారు. విద్యార్థులకు సాంకేతికపరమైన అంశాలను వివరించడం, కొత్తదనాన్ని నేర్పించడం అలవాటుగా మార్చుకుని అవార్డుల మాస్టారుగా పేరొందారు రాజాం మండలం కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పందూరు వేణుగోపాల్. ఎం.సీతారాంపురం, వీరఘట్టం, జి.సిగడాం, పొగిరి, కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేసే కాలంలో విద్యార్థులతో ప్రాజెక్టులు తయారు చేయించి జాతీయ స్థాయిలో ప్రశంసాపత్రాలు, నగదు అవార్డులు పొందేలా కృషి చేశారు. సైన్స్ గైడ్‌గా 18 సార్లు జిల్లా స్థాయి, 18 సార్లు రాష్ట్రస్థాయి, 8 సార్లు జాతీయ స్థాయి, రెండుసార్లు ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమాలలో ప్రాజెక్టులు ప్రదర్శింపజేశారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్వహించిన జాతీయ స్థాయి కార్యక్రమంలో ప్రదర్శించిన తృణధాన్యాల ప్రాజెక్ట్‌కు రూ.50 వేల నగదు బహుమతిని దక్కించుకున్నారు. అదే ప్రాజెక్ట్‌కు పూణేలో నిర్వహించిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమంలో రూ.30 వేల నగదు బహుమతి లభించింది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమంలో కంచరాం ఉన్నత పాఠశాల విద్యార్థులతో తయారు చేయించిన ప్రాజెక్ట్‌కు రూ.20 వేల నగదు బహుమతిని అందుకున్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు సులభతరంగా అనుమతులు

- జేసీ సేతుమాధవన్


మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తులు చేసిన వారికి సులభతరంగా అనుమతులివ్వాలని, దరఖాస్తుల పరిశీలన ఉదారంగా జరగాలని జేసీ సేతు మాధవన్ తెలిపారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా గత ఏడాది 2,257 దరఖాస్తులకు అనుమతులు ఇచ్చినట్లు చెప్పారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై(ఈవోడీబీ) జేసీ ఆధ్వర్యంలో వర్క్ షాప్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవోడీబీలో ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం అందుతుందని, అధికారులంతా దీనిని దృష్టిలో పెట్టుకుని పని చేయాలని కోరారు.ఈవోడీబీపై కేంద్ర ప్రభుత్వం సర్వే చేస్తుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్నవారికి ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్ వస్తాయని, వారు అన్ని శాఖల నుంచి అందిన సహకారంపై అభిప్రాయాన్ని పాజిటివ్‌గా చెప్పాలని పేర్కొన్నారు. గత ఏడాది ఫిబ్రవరి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు చేసుకున్న దరఖాస్తులు ఫోన్ ద్వారా అభిప్రాయాలను సేకరించనున్నట్లు తెలిపారు. అనుమతులు ఆన్‌లైన్‌లో ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రతి నెల జిల్లా పరిశ్రమల ప్రమోషన్ కమిటీలో సమీక్షించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో జిల్లా ఉత్తమ స్థానంలో ఉందని చెప్పారు. సమావేశంలో పరిశ్రమల మేనేజరు కరుణాకర్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరిత, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ప్రసాదరావు పాల్గొన్నారు.


జరడ పరిసరాల్లో ఉన్న ఏనుగులు

జరడలో ఏనుగుల గుంపు

కురుపాం రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల గుంపు జరడ పంచాయతీలోని వివిధ గ్రామాల్లో సంచరిస్తున్నాయి. గిరిజనులు పండిస్తున్న కొండ పోడులను ధ్వంసం చేస్తున్నాయి. జీలుగు, పనస చెట్లను నాశనం చేస్తున్నాయి. కొండ పోడుల్లో వేసిన చిరుధాన్యాలను పాడు చేస్తున్నాయి. వరి నారు మడులనూ తొక్కి పాడు చేస్తున్నాయి. దీంతో గిరిజనులు కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు. ప్రభుత్వం ఈ సమస్యకు పరిష్కారం చూపాలని సర్పంచ్ జ్యోతి కోరారు.